క్లుప్తంగా

రొంపిచెర్ల డీటీ లోకేష్ బదిలీ

–ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఇస్సాక్

రొంపిచెర్ల: రొంపిచెర్ల డిప్యూటీ తహసీల్దార్ లోకేష్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న మోహీద్దీన్‌ను కర్నూలు జిల్లాకు బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో డీటీగా పనిచేస్తున్న ఇస్సాక్‌ను రొంపిచెర్ల డీటీగా బదిలీ చేస్తూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన రెండ్రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలి

పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీని ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెన్షనర్లకు డీఆర్, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, అదనపు పెన్షన్ గతంలో ఇచ్చిన విధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


శివకుమార్

గంగవరం:తహసీల్దార్‌గా జీఎల్. శివకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈయన ఉద్యోగోన్నతి పొంది ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన లోకేశ్వరరావు ప్రస్తుతం సెలవులో ఉన్నారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ, మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తొలుత ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చర్యలు


డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న రామమూర్తి విగ్రహంతో ప్రిన్సిపల్ రాజశేఖర్, శ్రీనివాసమూర్తి తదితరులు

పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కళాశాల కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శుభారం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసమూర్తి, రెడ్డెప్ప హాజరై సభ్యులతో కలసి మాట్లాడారు. కళాశాల ప్రహరీ నిర్మిస్తామని, లింకు రోడ్డు వేస్తామన్నారు. అలాగే కళాశాల వ్యవస్థాపకులు సన్నుతి రామమూర్తి విగ్రహాన్ని ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా వార్షికోత్సవం, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, ఆదర్శవంతమైన కళాశాలగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో సభ్యులు భక్తవత్సల రాజు, సత్య, రెడ్డెప్పరెడ్డి, బాలసుబ్రమణ్యం, శేషప్ప గుప్తా, రంగనాయకులు, హరినాథరెడ్డి, ప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయండి



బైరెడ్డిపల్లె: చౌక దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ మాధవరావు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ తన కార్యాలయంలో మండలంలోని డీలర్లకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పేదలకు అందుతున్న సరుకుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదన్నారు. అనంతరం నూతన తహసీల్దార్ మాధవరావును డీలర్లు సత్కరించారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని స్థానిక ఎమ్మెల్యే అమర్‌నాథ రెడ్డి తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పలమనేరు రూరల్ మండల నేతలతో సమావేశం నిర్వహించారు. అత్యవసరమైన పనులకు తొలి ప్రాధాన్యనివ్వాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా అధికారులతో చర్చించి వాటిని పరిష్కరిస్తామన్నారు. ప్రజలు నివేదించే సమస్యలపై సైతం అధికారులు స్పందించాలని సూచించారు. ఇక, నాయకులు సైతం పార్టీకి ఇబ్బంది కలగకుండా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగదీష్‌నాయుడు, పెద్దబ్బ, నాగరాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి కేంద్ర‘బిందు’వు

- డ్రిప్ ఇరిగేషన్‌తో రైతుకు లాభం
- తక్కువ నీటితో అధిక దిగుబడి
- రాయితీపై సూక్ష్మ పరికరాల పంపిణీ


డ్రిప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: పుంగనూరు నియోజకవర్గంలో బిందు సేద్యంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితో ఖర్చుతో అధిక ఆదాయం పొందడానికి డ్రిప్ ఇరిగేషన్ ఉపయుక్తంగా ఉండడంతో రైతాంగంలో మక్కువ పెరిగింది. ముఖ్యంగా నీటి లభ్యత తక్కువగా ఉండే పడమటి మండలాల రైతులు డ్రిప్ ఇరిగేషన్ రైతులకు లాభసాటిగా మారింది. వ్యవసాయానికి తక్కువ నీటిని వినియోగిస్తూ..పంటలను సాగు చేసేందుకు సూక్ష్మ సేద్యం ఎంతగానో ఉపయోగపడుతోంది. దీని ప్రాధాన్యత గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలలో సుమారు వెయ్యి మంది రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ చేసింది. ప్రస్తుతం డ్రిప్, స్ప్రింకర్లను మంజూరు చేసేందుకు రైతు సేవా కేంద్రాలలో వివరాలను నమోదు చేస్తున్నారు.

ఉపయోగాలు ఇవీ..

వ్యవసాయంలో నీరు, పోషకాల పంపిణీకి డ్రిప్ ఇరిగేషన్ విధానం అత్యంత ప్రభావవంతమైనదిగా నిపుణులు చెపుతున్నారు. నీరు, పోషకాలు సరైన మోతాదులో పంటకు అందించవచ్చు. ఆవిరి, ప్రవాహాల కారణంగా కలిగే నీటి నష్టాలను తగ్గిస్తుంది. సంప్రదాయ నీటి పారుదల పద్ధతులతో పోలిస్తే ఈవిధానంతో 30 నుంచి 50 శాతం వరకు తక్కువ నీటిని వినియోగంతో పంటలు సాగు చేయవచ్చు. అలాగే సంప్రదాయ పద్ధతులతో నీటిని అందించడం ద్వారా అధిక నీరు అంది మొక్కలకు తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. డ్రిప్ వ్యవస్థతో సరైన తేమ స్థాయిలు ఉండేలా చూసుకోవచ్చు. పొలంలో కలుపు మొక్కలు పెరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

సబ్సిడీపై సామగ్రి

బిందు సేద్యం పరికరాలను రాయితీపై ఇస్తున్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీపై, 5 నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులకు 70శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నారు.


డ్రిప్ విధానంతో సాగు చేసిన పంట (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి



సూక్ష్మ సేద్యం పరికరాలను రాయితీపై ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ మేరకు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేయిస్తున్నాం. ఆసక్తి గల వారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, ఆన్‌లైన్ వన్–బీ, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చు.

- సంతోషి కుమారి, ఉద్యానవన శాఖాధికారి, సదుం

మండలం	మొత్తం సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు	డ్రిప్ విధానంలో సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
చౌడేపల్లె	4,998	3,950	375	208
సోమల	9,850	7,560	580	325
సదుం	8,550	6,840	462	287
పులిచెర్ల	15,650	8,580	275	142
రొంపిచెర్ల	8,550	6,280	237	168

కుల రాజకీయాలకు కూటమి తెరలేపింది


సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర నేత యమలా సుదర్శనం

- మోదీ, అమిత్‌షాల ప్రభావంతోనే సుప్రీం తీర్పు
- మాలలను రోడ్డుపాలు చేసే కుట్ర ఇది
- ‘వర్గీకరణపై సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేస్తాం
- మాల మహానాడు రాష్ట్ర నేత యమలా సుదర్శనం

పలమనేరు: మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి కుల రాజకీయాలకు కూటమి పార్టీలు తెరలేపాయని దీంతో మాలల ఉద్యమాలు తీవ్రతరం కావడం తథ్యమని మాల మహానాడు రాష్ట్ర నాయకులు యమలా సుదర్శనం హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద జిల్లా మాల మహానాడు నేతలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు, మోదీ కుట్ర పన్ని తమను మోసం చేశారన్నారు. రాష్ట్రాలకు వర్గీకరణ చేసే అధికారం ఏమాత్రం లేదని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 స్పష్టంగా చెప్పిందన్నారు. దీనిని విస్మరించి సుప్రీం కోర్టు మోదీ ప్రభావిత తీర్పునిచ్చిందని ఆరోపించారు. కూటమి చేసిన మోసంతో రాష్ట్రంలోని మాలల బతుకులు రోడ్డున పడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై తాము రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేస్తామన్నారు. మాలలకు జరిగిన అన్యాయంపై గ్రామ, మండల స్థాయి నుంచి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీనిపై ఇప్పటికే కార్యాచరణకు పూనుకున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా మాల మహానాడు నాయకులు గ్యాస్ భాస్కర్, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘డాయ్’ బాధితుల ఆందోళన

–న్యాయం చేయాలని వినతి


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న డాయ్ యాప్ బాధితులు

పలమనేరు: మున్సిపాలిటీలోని మెప్మా ఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్ కారణంగా డాయ్ యాప్‌లో లక్షలు కట్టి మోసపోయామని, తమకు న్యాయం చేయాలంటూ కోరుతూ సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద పలువురు డాయ్ యాప్ బాధితులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, యాప్ చేసిన మోసంపై ఇటీవలే కలెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీకి సైతం తాము ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన రాజేష్‌ను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

పలమనేరు ఆర్టీసీ డిపో పరిరక్షణకు చర్యలు ప్లీజ్!

- అధికారులకు పీపీఎస్ నేతల వినతి


ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు

పలమనేరు: నిర్వీర్యమై పోతున్న పలమనేరు ఆర్టీసీ డిపో పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు ఆందోళన చేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు మాట్లాడారు. గతమెంతో ఘనకీర్తి కలిగిన పలమనేరు డిపోలో బస్సులు లేక, ఉన్న బస్సులను పక్క డిపోలకు తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలమనేరు నుంచి సీఎంసీకి వెళ్లాలన్నా, లేదా బెంగళూరు, చెన్నై, తిరుపతిలకు సైతం ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు లేక అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తాము ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సైతం విన్నవించినా ఫలితం లేదన్నారు. కనీసం ఆర్టీసీ ఉన్నతాధికారులైనా స్పందించి, పలమనేరు డిపోలో సర్వీసులను పెంచి, ప్రయాణికులకు సేవలందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీపీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పం డీఎస్పీగా పార్థసారథి


పార్థసారథి

కుప్పం: కుప్పం డీఎస్పీగా పార్థసారథి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శ్రీనాథ్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో విజయవాడ స్పెషల్ బ్రాంచ్ నుంచి పార్థసారథి కుప్పానికి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో శాంతిభద్రతలు పరివేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణా, సరఫరా అరికట్టేందుకు పోలీసుల నిఘా పెంచుతామన్నారు.

ఖాళీ పోస్టుల్లో మమ్మల్ని నియమించరూ!

–తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రెవెన్యూ సహాయకులు

వి.కోట: కొన్నేళ్లుగా తక్కువ జీతంతో పనిచేస్తున్న తమను ఖాళీగా ఉన్న పోస్టుల్లో డ్యూటీలు వేసి ఆదుకోవాలని మండల రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) సోమవారం తహసీల్దార్ పార్వతికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, తెలంగాణలో అమలవుతున్న విధంగా వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, అదనంగా అప్పచెప్పిన వాచ్‌మన్ డ్యూటీలు రద్దు చేసి ఖాళీగా ఉన్న పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం నియమించాలని, తమకు వీఆర్‌ఓ, అటెండర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుందని తహసీల్దార్ వారికి చెప్పారు.

‘ఉపాధి’ కల్పించరూ!

- యంత్రాలతో పనులు చేస్తున్న టీడీపీ నేతలు
- పనులు లేక కూలీల వలసలు


ఎంపీడీఓ, ఏపీఓకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ బాలక్రిష్ణగౌడు

బైరెడ్డిపల్లె: వలసల నివారణ కోసం ఉద్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని సర్పంచ్ బాలక్రిష్ణగౌడు సోమవారం ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, ఏపీఓ హరినాథ్‌లకు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పనులను టీడీపీ నేతలు యంత్రాలతో చేస్తుండడంతో కూలీలకు పనులు లేక వలసలు వెళ్తున్నారన్నారు. జాబ్‌కార్డులు ఉన్నా కూలీలు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా యంత్రాలతో చేస్తుండడంతోపాటు మరోవైపు తక్కువమంది కూలీలతో పనులు చేయించి బిల్లులు స్వాహా చేస్తున్నట్లు చెప్పారు. యంత్రాల పనులకు చెక్ పెట్టి కూలీలకు పనులు కల్పించాలని కోరారు.

సదుంలో మోస్తరు వర్షం

సదుం: మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాలలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కొంత కాలంగా సరైన వర్షం లేక పలు చోట్ల వేరుశనగ వాడిపోతోంది. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం వేరుశనగ పంటకు మేలు చేకూరుతుందని రైతులు చెప్పారు.

తల్లి పాలే బిడ్డకు మొదటి టీకా


తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రొంపిచెర్ల: తల్లి పాలే బిడ్డకు మొదటి టీకా వంటిదని మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి అన్నారు. ఆమె రొంపిచెర్ల–1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లుల అవగాహన గ్రామసభలో మాట్లాడారు. బిడ్డ పుట్టిన 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. దీని వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పోత పాలు పట్టడం వలన జబ్బుల బారిన పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారంతో మంచి భోజనం పెడుతున్నారని తెలిపారు. కోడి గుడ్డు, ఆకు కూరలు అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త అలివేలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై నిరసన


మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవరావు

బైరెడ్డిపల్లె: తమ భూమిని ఆక్రమించుకుని ఏళ్ల కాలంగా వేధిస్తున్నారని మండలంలోని తాతిరెడ్డిపల్లెకు చెందిన వెంకటలక్ష్మమ్మ కుటుంబీకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామ లెక్క దాఖలా 174/7లో విస్తీర్ణం 2.05 ఎకరాలు ఉందన్నారు. తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రికార్డుల్లో తారుమారు చేసి అతని పేరిట మార్చుకుని వేధిస్తున్నాడని, భూమి లేకపోతే తాము జీవనాధారం కోల్పోతామని తమ గోడు నివేదించారు. స్పందించిన తహసీల్దార్ మాధవరావు రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకు తెరపడింది.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రోడ్‌షో


పుంగనూరులో రోడ్‌షో నిర్వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు/చౌడేపల్లె/సదుం: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం పుంగనూరు, చౌడేపల్లె, సదుంలో రోడ్‌షో నిర్వహించారు. పుంగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గోకుల్ సర్కిల్‌లో టీడీపీ జెండాను ఎగురవేశారు. ట్రావెలర్స్ బంగ్లాలో అధికారులు, పార్టీ క్యాడర్‌తో సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రోడ్‌షోలో ప్రజల నుంచి మంత్రి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. దేశం ఇన్‌చార్జ్ చల్లాబాబు, నాయకులు వెంకటరమణరాజు, సివి.రెడ్డి, గిరి, మాధవరెడ్డి, సుబ్రమణ్యంరాజు, ఆర్‌విటి.బాబు, సద్దాం, సుహేల్, లక్ష్మీపతి రాజు, రమేష్‌రెడ్డి, ప్రదీప్‌రాజు, చంద్రమౌళి, రామచంద్ర, గిరిరాజు, హరిబాబు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్తు మారెమ్మ ఉత్సవాలు



కుప్పం: స్థానిక రామచంద్రరోడ్డుని శ్రీ ప్రసన్న ముత్తు మారెమ్మ దేవాలయంలో ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు హర్షా గోపినాథ్ తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తొలిరోజు ఉదయం వివిధ హోమాల అనంతరం అమ్మవారికి పంచామృత అభిషేకం చేశారు. మంగళవారం ఉదయం అభిషేకం, అంబలి సమర్పణ, బుధవారం ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి అమ్మవారి పుష్పపల్లకి నిర్వహించనున్నట్టు హర్షా గోపినాథ్ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధితులకు చెక్కులు అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. మండలంలోని మొగిలివారిపల్లెలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అరుణ్ కుమార్, హరీష్, రాజాకు పార్టీ అధిష్టానం ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఈ క్రమంలో సునీల్‌కుమార్ సోమవారం సాయంత్రం బంగారుపాళెంలో బాధితులకు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకూ జగనన్న అండగా ఉంటారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలవుతున్నా ఇప్పటికీ టీడీపీ అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడటం లేదని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై కక్ష కట్టి మరీ దాడులు చేస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి కట్టుగా ఉండి వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి దాతల వితరణ


ఆలయ అభివృద్ధికి దోహదం చేస్తున్న దాతలతో ఆలయ అర్చకులు

పలమనేరు: పట్టణంలోని శివాలయానికి అవసరమైన వాటిని దాతలు సోమవారం అందజేశారు. గంటావూరుకు చెందిన మురగన్‌ఆలయంలో ప్రసాద సామగ్రి, దీపం స్టాండ్లను అందజేశారు. అలాగే, పెంగరగుంటకు చెందిన వెంకటేష్ గర్భగుడిలో ఫ్లోర్ టైల్స్, వాల్‌టైల్స్ అందజేసి సౌకర్యాల కల్పనకు తోడ్పాటునిచ్చారు. ఆలయ అర్చకులు దాతలకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో నవీన్, సేటు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్కూల్ అభివృద్ధి


షెడ్ కింద మధ్యాహ్న భోజనం చేయడానికి కూర్చుని ఉన్న విద్యార్థినులు

- భోజన షెడ్ నిర్మాణానికి రూ.5.80లక్షల విరాళం
- టీచర్ల వితరణతో ఆటస్థలం చదును

వి.కోట: దాతల సహకారంతో స్కూల్‌ను మరింత అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి కృషి చేస్తున్నామని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పరశురాం తెలిపారు. ఇటీవల బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినుల సౌకర్యార్థం భోజనం చేయడానికి వీలుగా రూ.4లక్షలతో షెడ్ నిర్మాణానికి పట్టణానికి చెందిన సుప్రభాత్ యాక్స్ సంస్థ అధినేత ఉదయ్‌సాగర్‌రెడ్డి సహకరించారని, గతంలో విద్యార్థులు ఎండలో ఎక్కడబడితే అక్కడ కూర్చునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం షెడ్ నీడలో భోజనం చేస్తున్నారని తెలిపారు. అలాగే మండలానికి చెందిన వ్యాపారవేత్తలు దామోదరం రెడ్డి, పురుషోత్తం, పాతురు సతీష్ 1,80,000 రూపాయల ఆర్థిక సాయంతో షెడ్ కింద మెట్లను నిర్మించినట్లు చెప్పారు. అలాగే ఉపాధ్యాయ బృందం సైతం రూ.3లక్షలు ఇవ్వడంతో ఆటస్థలం చదును, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించినట్టు చెప్పారు. అభివృద్ధి పనుల్లో దాతల సహకారానికి తోడు టీచర్లు కూడా తమవంతు భాగస్వామ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.